
ఎన్నికల నియమావళిని
ఉల్లంఘించొద్దు
- అధికారులు, పోలీసుల సూచన
- పలు మండలాల్లో అవగాహన కార్యక్రమాలు

8

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY




సిద్దిపేట
5
శుక్రవారం 5 డిసెంబరు 2025

హామీలు.. ఆఫర్లు

- కులం, గుడి, మద్యం చుట్టూ తిరుగుతున్న పంచాయతీ పోరు
- ఒకరిని చూసి మరొకరి ప్రచారాస్త్రాలు

- ఏకగ్రీవాల కోసం రూ.లక్షలు కుమ్మరిస్తున్న ఆశావహులు
- తాళ్లపల్లిలో 63 మందిపై కేసు నమోదు
- కొన్ని గ్రామాల్లో ఒక్కటవుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు



పంచాయతీ ఎన్నికలు సమీపిస్తుండటంతో పల్లెల్లో రాజకీయం వేడెక్కి రసకందాయంలో పడింది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు తమ అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహాలు రచిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికలను సవాలుగా తీసుకుని పావులు కదుపుతున్నారు. ఒకవైపు కుల సంఘాల మద్దతు కూడగట్టేందుకు మంతనాలు జరుపుతుంటే, మరో వైపు ఏకగ్రీవం కోసం నామినేషన్ల దాఖలుకు ముందే కొందరు అభ్యర్థులు కోట్ల రూపాయల ఆఫర్లతో వేలంపాట నిర్వహిస్తున్నారు. దీనికితోడు, మద్యం, విందులతో పల్లెలు ఊగుతున్నాయి. కొన్ని గ్రామాలలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఒక్కటై బీజేపీ మద్దతు ఇస్తున్న అభ్యర్థులకు గట్టి పోటీ ఇస్తుండగా, మరి కొన్ని చోట్ల ఆలయాలు, గుడుల నిర్మాణాలను ప్రధాన ప్రచారాస్త్రాలుగా మార్చి, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

- తొగుట/చేర్యాల/దుబ్బాక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి)

కుల సంఘాల మద్దతు కోసం మంతనాలు

తొగుట, చేర్యాల మండలాల్లో ఎన్నికల వాతావరణం పతాక స్థాయికి చేరింది. తమ అభ్యర్థుల విజయం కోసం ప్రధాన పార్టీల నాయకులు శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తున్నారు. తొగుట మండలంలో బీజేపీని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఒక్కటవుతున్నారు. దీన్ని సవాలుగా తీసుకు న్న కాంగ్రెస్ నేతలు, ముఖ్యంగా నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్‌రెడ్డిలు తమ మద్దతుదారుల గెలుపునకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తొగుట, తుక్కాపూర్, గోవర్ధనగిరి, గుడికందుల, కాన్గల్, లింగాపూర్ గ్రామాల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు గట్టి పోటీనిస్తున్నారు.నామినేషన్ల ఉపసంహరణకు ఇంకా గడువు ఉండటంతో, కొన్ని గ్రామాల్లో సర్పంచ్ స్థానాలను ఏకగ్రీవం చేయడానికి తెరచాటున పావులు కదుపుతున్నారు.

తుక్కాపూర్, తొగుట, పెద్దమాసాన్‌పల్లి, ఘనపూర్, గుడికందుల, వెంకట్రావ్‌పేట, లింగాపూర్, కాన్గల్, గోవర్ధనగిరి, వర్ధరాజ్‌పల్లి, బండారుపల్లి గ్రామాల్లో పార్టీల నేతలు కుల సంఘాల పెద్దలతో చర్చలు జరుపుతున్నారు. తమ అభ్యర్థులకు మద్దతుగా నిలిస్తే, ఒక్కో గ్రామంలో గుడి, మసీదు లేదా కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని చేపడతామని ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. కుల సంఘాల మధ్య చిచ్చు రేగి, రెండుగా విడిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

రూ.లక్షల్లో వేలం

చేర్యాల మండలంలోని పలు గ్రామాల్లో గుడులు, గోపుర నిర్మాణాలను ప్రధాన ప్రచారాస్త్రంగా మార్చుకున్నారు. నామినేషన్ల దాఖలుకు ముందే పలువురు అభ్యర్థులు ఏకగ్రీవం కోసం ఒకరిని మించి మరొకరు ఖర్చుకు వెనుకాడకుండా వేలంపాటలో పాల్గొంటున్నారు. ఆలయాలు, గ్రామదేవతల మంటప నిర్మాణాలు, స్వాగత తోరణాలు, సీసీ రోడ్ల నిర్మాణం చేస్తామని హామీలు గుప్పిస్తున్నారు. పోతిరెడ్డిపల్లిలో దుర్గమ్మ ఆలయ నిర్మాణం, ఊరి అవసరాల కోసం స్థలం ఇచ్చే విషయంలో కులస్తులు సమావేశమవగా, ఒక ఆశావహుడు రూ.50 లక్షలు ఇస్తానని చెప్పగా, మరో వ్యక్తి రూ.75 లక్షలు ఇస్తానని చెప్పడంతో ఆ గ్రామం ఏకగ్రీవానికి అంగీకరించినట్లు తెలిసింది. కడవేరుగు గ్రామంలో దుర్గమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, పండుగల నిర్వహణ ఇతర అంశాలపై కులస్థులు సమావేశమయ్యారు. ఓ అభ్యర్థి రూ.50లక్షలు ఇస్తాననగా, పోటీదారుడు రూ.55 లక్షలు ఇస్తానని చెప్పాడు. అనంతరం మొదటి వ్యక్తి రూ.60లక్షలు, పోటీదారుడు రూ.65 లక్షలు ఇస్తానని చెప్పడంతో చివరి వ్యక్తితో ఏకీభవించి ఏకగ్రీవం దిశగా చర్యలు తీసుకున్నారు. అయితే, ఇంతలో చెప్పా పెట్టకుండా వేరే వ్యక్తి నామినేషన్ దాఖలు చేయడంతో వేలం ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది.

దొమ్మాట గ్రామ శివారులో అభివృద్ధికి నోచుకోని వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. ఇక్కడ పోటీలో నిలిచిన ఓ అభ్యర్థి భర్త, ఆలయ అభివృద్ధి, స్వాగత తోరణం నిర్మాణం చేయడంతో పాటు గ్రామదేవతల గుడులు నిర్మిస్తానని బహిరంగంగా ప్రకటించాడు. ఇలా ఒకరిని చూసి మరొకరు దేవుళ్ల పేరిట ఆఫర్లు ఇస్తుండటంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇదే చర్చ కొనసాగుతోంది. అక్బర్‌పేట- భూంపల్లి మండలం తాళ్లపల్లిలో ఒక సామాజిక వర్గం ఆ గ్రామంలోని ఓ ఆలయం వద్ద బుధవారం సర్పంచులుగా పోటీచేస్తున్న ఐదుగురితో సమావేశం నిర్వహించారు. తమ సామాజికవర్గానికి చెందిన ఆలయాభివృద్ధికి ఎవరెంత డబ్బు ఇస్తారో వారికే ఓటు వేయాలని నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భూంపల్లి ఎస్ఐ హరీశ్, సిబ్బంది వెళ్లి వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా సమావేశం నిర్వహించడంతోపాటు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం లాంటి సెక్షన్‌లో 63 మందిపై కేసు నమోదు చేశారు.

పల్లెల్లో జోరుగా మందు, విందు

స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టినప్పటికీ, అభ్యర్థులు తమ అనుయాయులకు

మిగతా 8లో...



భలే మూను..

ఈ ఏడాది ఆఖరి సూపర్ మూన్ గురువారం ఆవిష్కృతమైంది. చందమామ భూమికి అత్యంత దగ్గరగా రావడం వల్ల లార్జెస్ట్‌గా మూన్‌గా ఏర్పడుతుందని, 2042లో మళ్లీ ఇంత దగ్గరగా చంద్రుడు దర్శనమివ్వనున్నట్లు పలువురు ఖగోళ నిపుణులు పేర్కొన్నారు. కోమటిచెరువుపై కనిపించిన ఈ అద్భుత దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట ఆంధ్రజ్యోతి

ఏకగ్రీవాల జోరు..
ధ్రువీకరణ పత్రాలు
అందజేత
- పలు చోట్ల ఉపసర్పంచ్‌ల ఎన్నిక

7



దత్తాత్రేయ స్వామి, ఆలయం వద్ద హోమాది కార్యక్రమం నిర్వహిస్తున్న వేద పండితులు, భక్తులు

నాచగిరిలో వైభవంగా దత్త జయంతి వేడుకలు

వర్గల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలోని ఉప ఆలయమైన శ్రీ దత్తాత్రేయ స్వామి, సాయిబాబా ఆలయంలో దత్త జయంతి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. వేడుకల సందర్భంగా ఉదయం ఆలయ వేద పండితులు వేద మంత్రోశ్చరణల మధ్య స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయం ఎదుట ఆలయ వేద పండితులు హోమాధి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు వేలాది మంది తరలివచ్చారు. దత్త జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు ముందుగా లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.

మల్లన్న కల్యాణ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

కొమురవెల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామివారి కల్యాణం ఈ నెల 14న జరగనున్న నేపథ్యంలో, కల్యాణ ఆహ్వాన పత్రికను గురువారం ఆలయ ఈవో టంకశాల వెంకటేష్, పాలకవర్గ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్, పర్యవేక్షకులు నీల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు బహూకరణ

కొమురవెల్లి మల్లికార్జున స్వామివారికి మండలంలోని గురువన్నపేట గ్రామానికి చెందిన పబ్బోజు శ్రీకాంత్‌చారి, తన తండ్రి బాలచారితో కలిసి గురువారం 10 గ్రాముల బంగారు ఆభరణాలను (కోరమీసం, అమ్మవార్ల ముక్కుపుడకలు) స్వామి వారికి బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి టంకశాల వెంకటేష్‌కు ఆభరణాలను అందించి, రసీదును స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, నీల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మల్లన్న కల్యాణ ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రెండో రోజు నామినేషన్ల జోరు

- సర్పంచ్‌లకు 295, వార్డు సభ్యులకు 1107

హుస్నాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రెండవ రోజైన గురువారం 163 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 295, 1432 వార్డులకు 1107 నామినేషన్లు దాఖలయ్యాయి. హుస్నాబాద్ మండలంలో 17 సర్పంచ్ స్థానాలకు 32, 140 వార్డులకు 94, అక్కన్నపేట మండలంలోని 38 సర్పంచ్ స్థానాలకు 55, 306 వార్డులకు 175, కోహెడ మండలంలోని 27 సర్పంచ్ స్థానాలకు 44, 244 వార్డులకు 174, కొమురవెల్లి మండలంలోని 11 సర్పంచ్ స్థానాలకు 24, 106 వార్డులకు 111, కొండపాక మండలంలోని 15 సర్పంచ్‌స్థానాలకు 37, 146 వార్డులకు 184, కుకునూర్‌పల్లి మండలంలోని 14 సర్పంచ్ స్థానాలకు 17, 120 వార్డులకు 58, ధూళిమిట్ట మండలంలోని 11 సర్పంచ్ స్థానాలకు 21, 94 వార్డులకు 58, మద్దూర్ మండలంలోని 10 సర్పంచ్ స్థానాలకు 21, 98 వార్డులకు 64, చేర్యాల మండలంలోని 20 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు 44, 184 వార్డులకు 189 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

చిట్యాలలో నామినేషన్ దాఖలు చేసిన పార్ట్ టైం టీచర్

చేర్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలలో భాగంగా చేర్యాల మండలం చిట్యాల గ్రామానికి చెందిన విద్యావంతురాలు తేలు శ్రీలత గురువారం సర్పంచు స్థానానికి నామినేషన్ దాఖలుచేశారు. ఎంఎస్సీ బీఈడీ పూర్తి చేసిన శ్రీలత చేర్యాలలోని ఓ విద్యా సంస్థలో పార్ట్ టైం టీచర్‌గా పనిచేస్తుంది. అనూహ్యంగా రాజకీయాలలోకి అడుగువేయగా, గ్రామాభివృద్ధికి పాటు పడతానని పేర్కొన్నారు.



కుకునూరుపల్లిలోని నామినేషన్ కేంద్రంలో అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కలెక్టర్ హైమావతి

కొండపాక/కొమురవెల్లి/కుకునూరుపల్లి/చేర్యాల, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పకడ్బందీగా జరగాలని, విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి హైమావతి స్పష్టం చేశారు. గురువారం ఆమె జిల్లాలోని కొండపాక, కొమురవెల్లి, కుకునూరుపల్లి, చేర్యాల మండలాల్లో ఎన్నికల ఏర్పాట్లు, నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు, చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కొండపాక మండలం దుద్దెడ క్లస్టర్, కొమురవెల్లి మండలం కిష్టంపేట గ్రామ కేంద్రం, అలాగే కుకునూరుపల్లి మండల కేంద్రంలోని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ నామినేషన్ల ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలి. అభ్యర్థుల తాకిడి ఎక్కువగా ఉంటే, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఆర్వో, ఏఆర్ఓలు రెండు కౌంటర్లు ఏర్పాటుచేసి నామినేషన్లను స్వీకరించాలని సూచించారు. ఎక్కువ మంది అభ్యర్థులుంటే వారికి టోకెన్లు ఇచ్చి క్యూలైన్లలో ఉంచాలని చెప్పారు. నామినేషన్ల కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎక్కువ మంది గుమిగూడకుండా, అభ్యర్థితో పాటు కేవలం ఇద్దరిని మాత్రమే లోపలికి అనుమతించాలని, ఈ విషయంలో గట్టి బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

చెక్‌పోస్టు తనిఖీ

చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీ విధానం, రికార్డుల నమోదు ప్రక్రియ ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె ముస్త్యాల క్లస్టర్ పరిధిలోని వీరన్నపేట, చుంచనకోట గ్రామాల్లో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను కూడా పరిశీలించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు పాల్గొన్నారు.



పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

ఎన్నికల నేపథ్యంలో ప్రజలను చైతన్యం పరచడానికే గ్రామాల్లో పోలీస్ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను చెప్పారు. గురువారం సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పుల్లూరు, పెద్దలింగారెడ్డిపల్లి, నారాయణరావుపేట, రాఘావాపూర్ గ్రామాల్లో పోలీస్ ఫ్లాగ్‌మార్చ్, ఎన్నికలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐరాజేష్, ఏఆర్ ఎస్ఐ సాయి చరణ్, ఏఎస్ఐ పరమేశ్వరి, పాల్గొన్నారు.

- సిద్దిపేట రూరల్

హవ్వ.. ఇలాగేనా పనులు!

- డ్రైన్ నిర్మాణంలో నాణ్యతా లోపం
- పగుళ్ల పైపుల వినియోగం

చేర్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేర్యాలలోని పాతబస్టాండు ఆవరణలో డ్రైన్ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. పట్టణ శివారులోని ఎంపీఐ కార్యాలయం నుంచి ఇండేన్ ఆయిల్ పెట్రోల్‌పంప్ వరకు దారిపొడవునా పలు ఇళ్లు, భవనాల ఆవరణను కూల్చి సీసీకాలువ పనులు చేపట్టారు. అంగడి బజారు, పాత బస్టాండు వద్ద ఖబ్రస్తాన్ ప్రహరీ ఉండటంతో పనులు నిలిపివేశారు. ఇటీవల పాతబస్టాండు వద్ద ఒక మార్గం గుండా రాకపోకలు నిలిపివేసి, కబ్రస్తాన్ ప్రహరీ ఆవరణలో గోతులు తవ్వారు. పైపులతో డ్రైన్ పనులు చేపట్టారు. నాసిరకం, పగుళ్లబారిన పైపులను వినియోగించసాగారు. నాణ్యత, ప్రమాణాలు పాటించకుండా చేపడుతుండడంతో మురుగునీటి ప్రవాహ ఉధృతికి ఈ నిర్మాణం ఎక్కువకాలం ఉండే పరిస్థితి లేదు. ఈ విషయంపై పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పాక బాలయ్యతో పాటు స్థానికులు గురువారం పనులను గమనించి, ఇవేం నాసిరకం పనులంటూ కాంట్రాక్టర్ సంబంధీకులను ప్రశ్నించారు. అందుకు వారు "మీరేం చేసుకుంటారో చేసుకోపోమని, జనగామలో చెప్పుకోపోమంటూ" దురుసుగా సమాధానమిచ్చారు. పనులు జరుగుతున్న సమయంలో పర్యవేక్షించాల్సిన ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకోవడం లేదని వారు మండిపడ్డారు. ఈ విషయంపై ఎన్‌హెచ్ అధికారులు జోక్యం చేసుకుని, నాణ్యత, ప్రమాణాలతో డ్రైన్ పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.



నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా చేస్తున్న పనులు



కబ్రస్తాన్ ప్రహరీ ఆవరణలో తీసిన గోతిలో బెడ్ వేయకుండానే వేస్తున్న పైపులు

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా

- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో, ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే జరిమానా తప్పదని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ హెచ్చరించారు. గురువారం సిద్దిపేట పట్టణంలో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పలు వార్డుల్లో పర్యటించారు. ఈ మేరకు పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లోని నర్సాపురం చెరువు వద్ద చెత్త వేస్తున్న సలీం అనే వ్యక్తికి రూ. వెయ్యి, బాబామియాకు రూ.500, మిలాన్ గార్డెన్ వద్ద చెత్తవేస్తున్న శ్రీనివాస్‌కు రూ. వెయ్యి, 3వవార్డులో వీ మార్ట్ నిర్వహకులకు (చెత్త కాల్చినందుకు) రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. పట్టణ ప్రజలు బహిరంగ ప్రాంతాల్లో వేయకూడదని, ప్రతిరోజు ఉదయాన్నే ఇంటింటికి వచ్చే మున్సిపల్ వాహనానికి మాత్రమే తడి, పొడి, హానికర చెత్తను వేరు చేసి అందించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు.



285.70 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

● హైవే పై విజిలెన్స్ తనిఖీలు

తూప్రాన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా చేస్తున్న 285.70 క్వింటాళ్ల రేషన్ బియ్యం గురువారం పట్టుకున్నట్లు రాష్ట్ర విజిలెన్స్ డీఎస్పీ రమేష్ తెలిపారు. గురువారం మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి హైవే 44పై టోల్‌ప్లాజా వద్ద సీఐ అజయ్‌బాబు, సివిల్ సప్లయ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహులు తో కలిసి వాహన తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం శ్రీమల్లికార్జున ట్రేడర్స్ నుంచి మహరాష్ట్ర లోని కొండల్‌వాడి (నాందేడ్)కు లారీ టీఎస్ 16 యూబీ 2731లో పీడీఎస్ సన్న బియ్యం రవాణా చేస్తూ పట్టిబడినట్లు వివరించారు. లారీ డ్రైవర్ నిజామాబాద్ జిల్లా కోటగిరికి చెందిన షేక్ మస్తాన్ (30) ను అదుపులోకి తీసుకొని రేషన్ బియ్యం తూకం వేయగా 285.70 క్వింటాళ్లు ఉన్నట్లు పేర్కొన్నారు. లారీలో అక్రమంగా తరలిస్తున్న 285.70 క్వింటాళ్ల రేషన్ బియ్యం తూప్రాన్ పౌరసరఫరాల గోదాంలో నిలువ చేసినట్లు తెలిపారు. లారీడ్రైవర్ షేక్ మస్తాన్‌లపై తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డీఎస్పీ రమేష్ తెలిపారు. పౌర సరఫరాలశాఖ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం వివరించారు.



డ్రైవర్‌తో పట్టుబడిన రేషన్ బియ్యం లారీ, విజిలెన్స్ డీఎస్పీ, సీఐలు

ఎర్రకుంట కబ్జాపై హైడ్రా విచారణ

ఐడీఏబొల్లారం డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడలోని ఎర్రకుంట ఆక్రమణపై మానవ హక్కులు వినియోగదారుల పరిరక్షణ సంస్థ అనే స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ఠాకూర్ రాజకుమార్ హరిత గ్రీన్ ట్రిబ్యునల్‌లో చేసిన ఫిర్యాదు మేరకు గురువారం అధికారుల బృందం కదిలి వచ్చింది. హైడ్రా సీఐ బాలగోపాల్ బృందంతో రెవెన్యూ, నీటిపారుదలశాఖ, మున్సిపల్ శాఖల అధికారులు ఎర్రకుంట ప్రాంతాన్ని పరిశీలించారు. సర్వేఆఫ్ ఇండియా మ్యాప్ ప్రకారం కుంట ఎక్కడ ఉండాలో అక్కడే ఉందని రాజ్‌కుమార్ చెప్పారు.

జిల్లా అధికారులు కోర్టును తప్పుదారి పట్టించే విధంగా వ్యవహరించారని తెలిపారు. దీనిపై రియల్ వ్యాపారికి అనుకూలంగా వ్యవహరించి కుంటను పక్కనే ఉన్న పరిశ్రమలోపల చూపిస్తున్నారని అన్నారు. రెండు వందలకోట్ల విలువయిన 8.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కుంటను రక్షించాల్సిన అవసరం ఉందని వివరించారు. దీనిపై హైడ్రా అధికారులు ప్రత్యక్ష విచారణ జరిపారు.

రాంపూర్ వద్ద రోడ్డు ప్రమాదం

● కారును ఢీ కొట్టిన ట్రాక్టర్
● ఇద్దరికి తీవ్ర గాయాలు


రాంపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు

అల్లాదుర్గం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):అల్లాదుర్గం మండలంలోని రాంపూర్ గ్రామ శివారులోని 161వ జాతీయ రహదారి పై గురువారం నాటి రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. హైదరాబాద్‌లోని బోరబండకు చెందిన సోయల్ తన సోదరితో పాటు ఆమె కూతురుతో కలసి సంగారెడ్డి జిల్లా నిజాంపేట మంలం మునిగెపల్లి గ్రామానికి కారులో వెళ్తున్న క్రమంలో రాంపూర్ వద్ద గల జాతీయ రహదారి పై ఎదురుగా (రాంగ్ రూట్) వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సోయల్, అతడి సోదరి ఏడెళ్ల కూతురుకు బలమైన గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వీరిని హైవే అంబులెన్స్ వాహనంలో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.







లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని జిల్లాన్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య అన్నారు. ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కోర్టులో గురువారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీకి అవకాశం ఉన్న ప్రతి ఒక్క కేసు పరిష్కరించాలన్నారు. రాజీ చేయదగ్గ పోలీసు కేసులు, భార్యాభర్తల చిన్న చిన్న వివాదాలు, ఎక్సైజ్ కేసులు లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలని అన్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని కక్షిదారులకు వివరించాలని న్యాయవాదులకు సూచించారు.

కిలో ఎండు గంజాయి పట్టివేత

ఐడీఏబొల్లారం డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంటివద్ద ఎండు గంజాయి అమ్ముతుండగా పట్టుకున్న సంఘటన ఐడీఏబొల్లారం పట్టణంలో చోటు చేసుకుంది. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన జగన్నాద్‌దాస్ అనే వ్యక్తి ఐడీఏబొల్లారంలో నివాసం ఉంటున్నారు. ఆరు నెలలుగా స్థానికంగా కార్మికులకు ఎండు గంజాయి అమ్మకాలు జరుపుతున్నాడు. సంగారెడ్డి టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం గురువారం దాడులు చేశారు. ఇంటిలో కిలో ఎండుగంజాయి, మోటారుసైకిల్, ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. జగన్నాద్‌దాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ శంకర్ చెప్పారు. ఎస్‌ఐలు అనుదీప్, హనుమంత్, కానిస్టేబుళ్లు అరుణజ్యోతి, సాయిశివకాంత్, రాజేష్, శివకృష్ణలు దాడుల్లో పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌తో దురుసు ప్రవర్తన ఒకరికి రిమాండ్

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఆర్టీసీ బస్సు డ్రైవర్ తో తురుసుగా ప్రవర్తించిన వ్యక్తిని రిమాండ్ చేసిన సంఘటన గురువారం సిద్దిపేట త్రీ టౌన్ పరిధిలో పొన్నాల సమీపంలో చోటుచేసుకుంది. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. బరిగెల కళ్యాణ్ అనే వ్యక్తి గుండారం గ్రామంలో తన బంధువుల బర్త్ డే పార్టీకి వెళ్లి మద్యం తాగి సిద్దిపేటకు వస్తుండగా శనిగరం స్టేజ్ వద్ద మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తన పక్కనుంచి వెళ్లిందని కోపంతో బస్సును వెంబడించాడు. బస్సును వెంబడిస్తూ బస్సుకు బైక్ అడ్డుపెట్టి బస్సును ఆపి డ్రైవర్‌తో దురుసుగా ప్రవర్తించాడు. బస్సు డ్రైవర్ తో పాటు ప్రయాణికులను కూడా ఇష్టానుసారంగా తిడుతున్నాడని స్థానిక త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్‌కు సమాచారం రావడంతో సిబ్బందితో అక్కడికి వెళ్లి విచారించారు. డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేయగా మద్యం సేవించినట్లు తేలిందని పోలీసులు తెలిపారు. అతడు పోలీసులతో కూడా దురుసుగా ప్రవర్తించాడని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్ కోట నరసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి మోటార్ సైకిల్, డ్రైవింగ్ లైసెన్స్ సీజ్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.

స్టోన్ క్రషర్ల ఏర్పాటు వద్దు

● రాళ్లకత్వలో సర్వేను అడ్డుకున్న గ్రామస్థులు

జిన్నారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలం దాదిగూడెంలో స్టోన్ క్రషర్ల ఏర్పాటు చేయనీయని గ్రామస్థులు స్పష్టం చేశారు. గురువారం దాదిగూడెం, రాళ్లకత్వ గ్రామ శివారులోని అంతయ్య చెరువు సమీపంలోని 829 సర్వే నెంబరులో జిల్లా మైనింగ్ శాఖ అధికారులు సర్వే చేపట్టారు. స్థానికంగా స్టోన్ క్రషర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తున్న స్థానికులు కోర్టులో కేసు వేశారు. క్రషర్ల కోసమే సర్వే నిర్వహిస్తున్నారని, తాము వద్దంటున్నా.. క్రషర్ యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. సర్వేను అడ్డుకున్నారు. కాగా మండల రెవెన్యూ అధికారుల సూచన మేరకే సర్వే చేపట్టామని మైనింగ్‌శాఖ అధికారులు తెలుపగా.. స్థానికుల అభ్యంతరంతో సర్వే నిలిపివేసి అధికారులు వెనుదిరిగారు.

విద్యార్థులకు చతుర్వేది ప్రక్రియలు వచ్చేలా చూడాలి

నారాయణఖేడ్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని వసతులు ఉండటంతో పాటు విద్యార్థులకు చతుర్వేద ప్రక్రియలు వచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని మండల నోడల్ అధికారి యశ్వంత్ సూచించారు. గురువారం ఆయన ఖేడ్ మండల పరిధిలోని అంత్వార్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి సమస్యలు, చదువులో విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకున్నారు.

క్రైం కార్నర్

చెట్టు నుంచి కింద పడి వ్యక్తి మృతి

జహీరాబాద్ , డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్ గ్రామానికి చెందిన అశోక్(30) అనే వ్యక్తి గురువారం చెట్లను నరికేందుకు వెళ్లగా అక్కడ ప్రమాదవశాత్తు చెట్టు మీద నుంచి కింద పడడంతో మృతి చెందాడు. జహీరాబాద్ రూరల్ ఎస్సై కాశీనాథ్ ప్రకారం..... గ్రామ శివారులో చెట్లను నరుకుతున్న క్రమంలో ఈ సంఘటన జరిగింది. గాయాలకు గురైనా అశోక్‌ను చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరిలించారు. వైద్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు

గుర్తు తెలియని వ్యక్తి ...


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెద్దశంకరంపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): 161 జాతీయ రహదారి పెద్దశంకరంపేట మండల పరిధిలోని జమ్మికుంట సర్వీస్ రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి వివరాల కోసం వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేట ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య


పోచమల్లు(ఫైల్)

మాసాయిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాసాయిపేట మండలం కుప్పలపల్లి గ్రామంలో ఆరోగ్యం బాగాలేక మనస్తాపానికి గురై ఓ వ్యక్తి తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. వెల్దుర్తి ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొప్పలపల్లి గ్రామానికి చెందిన దేవనూరు పోచమల్లు (57) అనే వ్యక్తి ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై మద్యానికి బానిస అయ్యాడు. ఈ విషయమై పోచమల్లు కుమారులు కుటుంబ సభ్యులు అతడిని మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు. పోచమల్లుని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోచమల్లు కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్దుర్తి ఎస్సై రాజు తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడు..


రాములు (ఫైల్)

మునిపల్లి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ యువకుడు బావిలో పడి మృతి చెందిన సంఘటన మేళాసంగం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మేళాసంగం గ్రామానికి చెందిన పెద్దగొల్ల రాములు (28)అనే వ్యక్తి జహీరాబాద్ పట్టణం బాబానగర్‌కు చెందిన మాధవిని గత ఏడాది క్రితం వివాహం చేసుకున్నాడు. అయితే వారి మధ్య ఏం జరిగిందో ఏమో రెండు నెలల క్రితం ఇరువురి కుటుంబాలు విడిపోయేందుకు ఒప్పందం కుదుర్చుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. . దీంతో మనస్థాపానికి గురై బుధవారం సాయంత్రం గ్రామ శివారులో తన పొలం వద్ద ఉన్న బావిలో దూకి ఆత్మహత్యకుపాల్పడ్డాడు. మృతుడి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు.

వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


దుర్గయ్య (ఫైల్)

వెల్దుర్తి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): హల్దీ వాగులో చేపలు, ఎండ్ర కాయల వేటకు వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతి దేహం లభ్యమైంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని హస్తాల్‌పూర్ గ్రామానికి చెందిన ఆవుల దుర్గయ్య (45) బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో చేపలు, పీతలు పట్టడానికి గ్రామ శివారులో ఉన్న హల్దీ వాగుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు దుర్గయ్య నీట మునిగి గల్లంతయ్యాడు. దీంతో దుర్గయ్య వెంట ఉన్న సాయిలు కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు సమాచారం ఇవ్వడంతో అక్కడి చేరుకున్న వారు ఎంత వెతికినా మృతదేహం లభించలేదు. గురువారం ఉదయం నీట మునిగిన దుర్గయ్య మృత దేహం పైకి తేలియాడింది. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీ కొని కానిస్టేబుల్‌కు గాయాలు

బెజ్జంకి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెక్ పోస్టు వద్ద కారు బార్ కేడ్లను ఢీ కొట్టడంతో ఓ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన బెజ్జంకి మండలం తోటపల్లి శివారులో రాజీవ్ రహదారి పై గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తోటపల్లి శివారు దేవక్కపల్లి సమీపంలో రాజీవ్ రహదారి పై ఎస్ఎస్‌టీ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గురువారం తెల్లవారు జామున చెక్ పోస్టు వద్ద ఏర్పాటు చేసిన బార్ కేడ్లను ఓ కారు ఢీకొట్టింది. శిబిరం వద్ద విధులు నిర్వహిస్తున్న రాజగోపాల్‌పేట పోలీసు స్టేషన్‌కు చెందిన సిద్ధిరాములు అనే కానిస్టేబుల్‌కు బార్ కేడ్ పొట్టలో తగిలి తీవ్ర గాయాలయ్యాయి. బార్ కేడ్‌ను ఢీ కొట్టిన కారును డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. కారును పోలీసులు పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. మద్యం మత్తులో కారులో ఉన్న కరీంనగర్‌కు చెందిన విజ్జగిరి ఆదిత్య, స్వాతినేని అమృత్‌కోటిలను అరెస్టు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సౌజన్య తెలిపారు.

సజావుగా నిర్వహించాలి



పోతారం(ఎస్)లో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు హరిత

● రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక అధికారి హరిత

కోహెడ/హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక అధికారి హరిత అధికారులకు సూచనలు చేశారు. గురువారం ఆమె కోహెడ మండలంలోని బస్వాపూర్, సముద్రాల గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాలను, హుస్నాబాద్ మండలంలో కొనసాగుతున్న పంచాయతీ ఎన్నికల నామినేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్ కేంద్రాలకు వచ్చిన వారిని మాత్రమే అనుమతించాలని, నామినేషన్ పత్రాలతో పాటు గెజిటెడ్ డిక్లరేషన్ సమర్పించిన వారినే అంగీకరించాలని తెలిపారు. అభ్యర్థులు అధికారులకు సహకరించాలని కోరారు. పందిల్ల, పోతారం(ఎస్)లో నామినేషన్ల వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బి.విజయభార్గవ్, హుస్నాబాద్ ఎంపీడీవో రమేష్, ఎంపీవో మోహన్, కోహెడ ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరమణారెడ్డి, తదితరులున్నారు.



ప్రచార ఖర్చుల నమోదు తప్పనిసరి

● నిబంధనలు పాటించకుంటే చర్యలు
● సంగారెడ్డి జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాకేష్



సంగారెడ్డి రూరల్/హత్నూర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ఖర్చుల వివరాలలో ప్రతీ పైసాను తప్పనిసరిగా నమోదు చేయాలని సంగారెడ్డి జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్ స్పష్టం చేశారు. గురువారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో అభ్యర్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిబంధనల మేరకు, అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు తమ ఖర్చుల రికార్డులతో వ్యయ పరిశీలకుల ముందు మూడుసార్లు విధిగా హాజరుకావాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. మొదటి విడత ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థుల ఖర్చుల రికార్డులను ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు పరిశీలిస్తారన్నారు. వ్యయాల పరిశీలనకు హాజరు కాని అభ్యర్థులకు నోటీసులు జారీ చేస్తామని, సరైన సంజాయిషీ ఇవ్వని వారిపై ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పోటీ చేసే అభ్యర్థులు ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయకుండా ప్రచారం నిర్వహించుకోవాలని సూచించారు. సర్పంచ్ అభ్యర్థులు గరిష్ఠంగా రూ.2,50,000, వార్డు సభ్యులు జనాభా ప్రాతిపదికన రూ.30,000 నుంచి రూ.50,000 వరకు మాత్రమే ఖర్చు చేయాలని, అంతకు మించి ఖర్చు చేసినట్లు తేలితే అభ్యర్థులపై అనర్హత వేటు తప్పదని రాకేష్ హెచ్చరించారు. ఎన్నికల ప్రచారానికి ఉపయోగించే వాహనాలకు స్థానిక తహసీల్దార్ దగ్గర తప్పనిసరిగా అనుమతి పొందాలని, లేకుండా వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రచారం సందర్భంగా ఎదుటివారిపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, దుష్ప్రచారం చేసినా, లేదా ఓటర్లకు డబ్బు, మద్యం, వస్తువు రూపేణా పంచుతూ నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో నిఘా విభాగం సభ్యులు పర్యటిస్తారని, ఎక్కడ నిబంధనల ఉల్లంఘన జరిగినా, రికార్డు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, ఎంపీడీవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యుడి స్థాయి నుంచి
రాష్ట్ర నేతగా..

● గీత పారిశ్రామిక సంస్థ చైర్మన్‌గా సేవలందించిన విగ్రాం రామాగౌడ్
● నాలుగు దశాబ్దాల పాటు రాజకీయాల్లో



విగ్రాం రామాగౌడ్ (ఫైల్)

పెద్దశంకరంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటకు చెందిన దివంగత నేత విగ్రాం రామాగౌడ్ తన రాజకీయ ప్రస్థానాన్ని వార్డు సభ్యుడు స్థానం నుంచి ప్రారంభించి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీత పారిశ్రామిక సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ వరకు ఎదిగారు. నాలుగు దశాబ్దాల పాటు పెద్దశంకరంపేట మండల రాజకీయాలను కీలకంగా ఉన్నారు. రామాగౌడ్ తన రాజకీయ జీవితాన్ని 1969-1970లో వార్డు సభ్యుడిగా ప్రారంభించి, ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 1982 నుంచి 1986 వరకు సర్పంచ్‌గా పని చేశారు. ఇదే సమయంలో ఆయన జోగిపేట పంచాయతీ సమితికి ఉపాధ్యక్షుడిగా, ఆ తర్వాత అధ్యక్షుడిగా కూడా సేవలందించారు. 1987లో పెద్దశంకరంపేట మండల పరిషత్‌కు మొట్టమొదటి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1995లో నారాయణఖేడ్ నియోజకవర్గం పరిధిలోని కల్హేర్ జడ్పీటీసీగా భారీ మెజార్టీతో గెలుపొందారు. అలాగే, ఆయన పెద్దశంకరంపేట జడ్పీటీసీగా కూడా పనిచేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో, 2002లో రామాగౌడ్‌కు రాష్ట్ర స్థాయి పదవి దక్కింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీత పారిశ్రామిక సహకార సంస్థ చైర్మన్‌గా ఎన్నికై సమర్థవంతంగా పని చేశారు. 2009 సంవత్సరంలో నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించారు. 2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం, ఆయన అప్పటి టీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన తర్వాత, భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆధ్వర్యంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఆయన కృషి ప్రజల గుండెల్లో నిలిచిపోయింది. రామాగౌడ్ రాజకీయ వారసత్వాన్ని ఆయన కుటుంబం కూడా కొనసాగించింది. ఆయన సతీమణి లలిత ఎంపీపీగా, జడ్పీటీసీగా పని చేశారు. ఆయన పెద్ద కుమారుడు శ్రీనివాస్‌గౌడ్ కూడా రెండుసార్లు ఎంపీపీగా, ఆ తర్వాత కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సేవలు అందించారు.

ఏకగ్రీవాల జోరు..
ధ్రువీకరణ పత్రాలు అందజేత

● పలు చోట్ల ఉపసర్పంచ్‌ల ఎన్నిక

తొలివిడత పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానాలు, వార్డు సభ్యులు ఏకగ్రీవమైన చోట గురువారం ఆయా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ధ్రువపత్రాలను అందజేశారు. పలుచోట్ల సమావేశాలను నిర్వహించి ఉపసర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. పాలకవర్గం చేత అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు.

పెద్దశంకరంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలంలో ఉన్న 27 గ్రామ పంచాయతీలకు గాను, ఐదు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఆయా స్థానాలకు కేవలం ఒక్క నామినేషన్ మాత్రమే రావడంతో అధికారులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కొత్తపేట సర్పంచ్‌గా తంబిగారి పోచమ్మ, సంగారెడ్డిపేట సర్పంచ్‌గా పి.బాలమణి, మాడ్చేట్‌పల్లి సర్పంచ్‌గా రాజుకుమార్, ఇసుకపాయల తండా సర్పంచ్‌గా దేవసోత్ కవిత, గట్టుకింది తండా సర్పంచ్‌గా మనోవత్ రాజు ఎన్నిక ధ్రువపత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్థులు నూతన సర్పంచ్‌లను అభినందించారు.

ఆరు పంచాయతీల ఉప సర్పంచ్‌ల ఎన్నిక

పాపన్నపేట, డిసెంబర్ 4(ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవమైన ఆరు గ్రామ పంచాయతీల్లో పాపన్నపేట మండలంలో గురువారం ఉప సర్పంచ్ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారులు ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు సభ్యులు, సర్పంచ్‌లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, నిబంధనలకు అనుగుణంగా ఉప సర్పంచ్ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో యూసుఫ్‌పేట్ ఉపసర్పంచ్‌గా బేగరి బాబు, లక్ష్మీనగర్ ఉపసర్పంచ్‌గా విజయచందర్, మల్లంపేట ఉప సర్పంచ్‌గా శ్రీరాం ఉస్మాన్‌గౌడ్, కందివల్లి ఉప సర్పంచ్‌గా పెంటన్న అనిత, నామాపూర్ ఉపసర్పంచ్‌గా రొడ్డ బాలరాజ్, అబ్రియాతండా ఉప సర్పంచ్‌గా కోలా కంసీబాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



వర్గల్‌లో ఏకగ్రీవమైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఆర్‌వో

చీలపల్లితండా సర్పంచ్‌గా సుశీలాబాయి

ఝరాసంగం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని చీలపల్లితండా గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వుడు కాగా, తండాకు చెందిన సుశీలబాయి మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. పోటీగా ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పంచాయతీలో మొత్తం ఆరు వార్డు సభ్యుల స్థానాలకు గాను, ఐదు వార్డులు ఏకగ్రీవమైనట్లు అధికారులు తెలిపారు. మండలంలోని 288 వార్డులకు గాను, 44 వార్డులకు ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైనట్లు ఎంపీడీవో మంజుల వెల్లడించారు.

మూడు గ్రామాల్లో ప్రమాణస్వీకారం

వర్గల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని 27 గ్రామ పంచాయతీలలో చాంద్‌ఖాన్ మక్తా, గుంటిపల్లి, తునికిమక్తా గ్రామాలు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ మూడు గ్రామాలలో గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సర్పంచ్, ఉప సర్పంచ్‌ల నియామకం, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమాలను నిర్వహించారు. చాంద్‌ఖాన్ మక్తా గ్రామపంచాయతీ సర్పంచ్‌గా మేదిన సజనీత భిక్షపతిరెడ్డి, ఉప సర్పంచ్‌గా చిందం కనకయ్య ప్రమాణం చేశారు. గుంటిపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా బొమ్మ మహంకాళమ్మ, ఉప సర్పంచ్‌గా కొండ పెంటమ్మ, అలాగే, తునికిమక్తా గ్రామపంచాయతీ సర్పంచ్‌గా పసుల స్వామి, ఉప సర్పంచ్‌గా పసుల రేణుక ప్రమాణ స్వీకారం చేశారు. ఏకగ్రీవమైన ఈ గ్రామాలలో నాయకులు, ప్రజలు పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.

ఆరెపల్లి పంచాయతీ ఏకగ్రీవం

రాయపోల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని ఆరెపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్‌తో పాటు అన్ని వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. గురువారం ఎంపీడీవో శ్రీనివాస్, రిటర్నింగ్ అధికారి(ఆర్వో) సమక్షంలో ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికలో వీరేశం ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు ఏకగ్రీవ సభ్యులందరికీ ఎన్నికల ధ్రువపత్రాలను ఎంపీడీవో, ఆర్వో అందజేశారు.

వేలం డబ్బు పంపకంలో వివాదం
ఫత్తేపూర్‌లో ఘర్షణ

● పోలీసులు రంగ ప్రవేశం
● గ్రామస్థులను చెదరగొట్టిన ఎస్సై

కల్హేర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : సర్పంచ్ పదవికి వేలం పాట ద్వారా వచ్చిన డబ్బు పంపకం విషయంలో సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం ఫత్తేపూర్ గ్రామంలో గ్రామస్థుల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. బుధవారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకోగా, సమాచారం అందుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఘర్షణకు దిగిన వారిని చెదరగొట్టారు. వివరాల్లోకి వెళితే.. ఫత్తేపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ అయింది. నాలుగు రోజుల క్రితం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు వేలం పాట నిర్వహించినట్లు తెలిసింది. బీఆర్ఎస్ మద్దతు ఉన్న నాందారి నవీన్, కాంగ్రెస్ తరఫున రాసాలం స్వామిదాస్ పాల్గొన్నారు. వేలం పాటలో నాందారి నవీన్ రూ.9.50 లక్షలకు పలికి, సర్పంచ్ పదవిని దక్కించుకున్నట్లు సమాచారం. ఈ డబ్బులు ఇప్పటికే చెల్లించినట్లు కూడా తెలిసింది. అయితే, వేలం పాట ద్వారా వచ్చిన ఈ మొత్తాన్ని ఒక కులానికి చెందిన ఆలయ నిర్మాణం కోసం మాత్రమే ఖర్చు చేయడానికి గ్రామ పెద్దలు నిర్ణయించడంతో వివాదం మొదలైంది. దీనిపై ఆగ్రహించిన గ్రామంలోని ఇతర కులాలకు చెందిన వారు, తమకు ఆ డబ్బుల్లో వాటా ఇవ్వకుంటే తాము వేరే అభ్యర్థిని ఎన్నికల బరిలో నిలబెడతామని బుధవారం రాత్రి ఒక సభ ఏర్పాటు చేసుకుని చర్చించారు. ఈ విషయం తెలిసిన వేలం పాట ద్వారా అభ్యర్థిని ఎంపిక చేసిన వర్గం వారు అభ్యంతరం చెప్పడంతో, ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. సమాచారం అందుకున్న కల్హేర్ ఎస్సై రవిగౌడ్ వెంటనే ఫత్తేపూర్ గ్రామానికి చేరుకుని, అందరినీ చెదరగొట్టారు. ఇదిలా ఉండగా, వేలం పాట ద్వారా ఎన్నికైన నవీన్ ఒక కులానికి చెందిన ఓట్ల మద్దతుతో ఒకవైపు ఎన్నికల బరిలో ఉంటుండగా, గ్రామంలోని ఇతర కులాల తరఫున మరో అభ్యర్థిని పోటీకి దించినట్లు గ్రామస్థులు తెలిపారు.



ఫత్తేపూర్‌లో గ్రామస్థులను చెదరగొడుచున్న పోలీసులు



మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

పంచాయతీ పోరులో కాంగ్రెస్ సత్తా చాటాలి

● బీఆర్ఎస్, బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలి
● రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

మునిపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించి, సత్తా చాటాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్, బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మునిపల్లి మండల పరిధి గార్లపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి, బీఆర్ఎస్ నాయకుడు ఈశ్వరప్ప, మాజీ ఉపసర్పంచ్ రాములు, పలువురు నాయకులు, కార్యకర్తలు గురువారం మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో సంగారెడ్డిలోని ఆయన స్వగృహంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదారంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు చేసేందేమి లేదని, గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కానీ ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లలోపే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత కరెంట్, రైతులకు రూ.2 లక్షల లోపు రుణ మాఫీ, రూ.500లకే గ్యాస్ సిలిండర్ తదితర పథకాలను అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పలు గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్‌కు అభ్యర్థులు కరువయ్యారని ఆయన ఎద్దేవా చేశారు. అలాంటి దుస్థితిలో బీఆర్ఎస్, బీజేపీ ఉన్నాయని, వాటిని ప్రజలెవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ప్రజలను కోరారు.

అభ్యర్థుల చూపు.. కాంగ్రెస్ వైపు

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గట్టెక్కేందుకు అందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి మండల పరిధిలో నాయకులు అధికార కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఇన్నాళ్లు ఇతర పార్టీల్లో ఉన్న వారు ఎన్నికల వేళ జంపింగ్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మంత్రి దామోదర్ రాజనర్సింహ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కొనసాగుతుండగా, ఆయన కటాక్షం కోసం ఎదురుచూస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు జోరుగా సాగుతున్నాయి. ఒక్కో గ్రామం నుంచి అభ్యర్థులు గులాబీ గూటి నుంచి కాంగ్రెస్‌కు చేరువవుతున్నారు. మునిపల్లిలో బీఆర్ఎస్‌కు చెందిన వ్యక్తి ఒక వార్డు స్థానానికి మాత్రమే నామినేషన్ దాఖలు చేశారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. తాజాగా గార్లపల్లి సర్పంచ్ అభ్యర్థి, బీఆర్ఎస్ మద్దతుదారుడు సైతం కాంగ్రెస్ కండువా వేసుకోవడంతో ఆ పార్టీకి గట్టి దెబ్బ తగిలిందనే చెప్పవచ్చు.

వ్యవసాయంలో యాంత్రీకరణతో మేలు

● అధునాతన యంత్రాల వినియోగంపై వివరించిన శాస్త్రవేత్త
● తోర్నాల పరిశోధన కేంద్రంలో అగ్రికల్చర్ ఎడ్యుకేషన్ డే

సిద్దిపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో అధునాతన యంత్రాలను వినియోగించడం ద్వారా రైతులకు సాగులో గణనీయమైన మేలు జరుగుతుందని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త జి.సంతోష్ కుమార్ అన్నారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం తోర్నాలలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో అగ్రికల్చర్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త సంతోష్ కుమార్ మాట్లాడుతూ, వ్యవసాయంలో రైతులు వినియోగించాల్సిన యాంత్రీకరణ పద్ధతి, మట్టి నమూనా పరీక్షలు, వాటి ఫలితాలను రైతులకు ఏ విధంగా వివరించాలి అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు పరిశోధన కేంద్రంలోని ల్యాబ్‌లను, ఆధునిక వ్యవసాయ యంత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ డి.పల్లవి, డాక్టర్ డి.శ్వేత, ఏ.సరిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ఎ.హిందుజా, జె. స్పందన తదితరులు పాల్గొన్నారు.



ఫార్మ్‌వర్క్, స్కాఫోల్డింగ్‌పై గీతం విద్యార్థులకు అవగాహన

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఐదో సెమిస్టర్ విద్యార్థులు ఇటీవల ఫీల్డ్ విజిట్‌కు వెళ్లారు. దీనిలో భాగంగా నిర్మాణంలో కాంక్రీటుకు కావలసిన ఆకారాన్ని ఇచ్చేందుకు ఉపయోగించే ఫార్మ్‌వర్క్ (రూపకల్పన), అలాగే ఎత్తులో ఉన్న ప్రదేశాలకు చేరుకోవడానికి, పనిముట్లను అందించడానికి కార్మికులు వినియోగించే స్కాఫోల్డింగ్ (పరంజాలు) గురించి విద్యార్థులు లోతైన అవగాహనను స్వీయ అనుభవం ద్వారా గడించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు అమిత్ భట్టాచార్య, తపతి తపస్విత భంజా మార్గదర్శనంలో ఈ సందర్శన జరిగింది. ఫార్మ్‌వర్క్ పద్ధతులను స్వయంగా చూడటం, అందులోని భాగాలను అధ్యయనం చేయడం, వాస్తవ నిర్మాణ ప్రాజెక్టులలో ఉపయోగించే పద్ధతులను తెలుసుకోవడం విద్యార్థులకు ఒక ప్రత్యేక అవకాశాన్ని కల్పించింది. వారు కలప, ప్లైవుడ్, లోహంతో సహా వివిధ రకాల ఫార్మ్‌వర్క్‌లను పరిశీలించి, నిర్దిష్ట నిర్మాణ అవసరాల ఆధారంగా వాటిని ఎలా ఎంచుకుంటారో తెలుసుకున్నారు. ఈ ఆచరణాత్మక అనుభవం తరగతి గది అభ్యాసాన్ని బలోపేతం చేయడమే కాకుండా, భవన నిర్మాణ పరిశ్రమకు అవసరమైన ఖచ్చితత్వం, ప్రణాళిక, సాంకేతిక నైపుణ్యం పట్ల వారి అవగాహనను మరింత పెంచింది.



ఫీల్డ్ విజిట్‌లో గీతం విద్యార్థులు

మా భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్ వద్దు

● హైకోర్టు తీర్పు వచ్చే వరకు భూముల జోలికి రావద్దు
● ఆర్డీవోకు చౌటపల్లి గ్రామస్థుల వినతి

హుస్నాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తమ భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్ నిర్మించి పేదల బతుకులను ఆగం చేయవద్దని కోరుతూ అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామ రైతులు గురువారం హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తికి మొర పెట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. తమ భూముల్లో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేస్తారో స్పష్టంగా తెలుపాలని, చట్టపరంగా ప్రకటించే అవార్డు ఎంత ఉంటుందో వివరంగా చెప్పకుండా భూములను లాక్కునే ప్రయత్నం చేయవద్దని రైతులు కోరారు. ఈ విషయంపై తాము ఇప్పటికే హైకోర్టులో రిట్ పిటిషన్ కూడా దాఖలు చేశామని, కోర్టు తుది తీర్పు వచ్చే వరకు తమ భూముల జోలికి రావద్దని వారు స్పష్టం చేశారు. అనంతరం, హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్‌ను చౌటపల్లి గ్రామ రైతులు కలిసి, తమ భూములను ఇండస్ట్రియల్ పార్క్ కోసం తీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు చుంచు శంకరయ్య, చుంచు రాజయ్య, పైనాల రాణి, మాశం రాధమ్మ, చుంచు జ్యోతి, ముక్కెర మల్లిక, శంకరయ్య, నాగభూషణం, భూమయ్య, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘించవద్దు

● అధికారులు, పోలీసుల సూచన ● పలు మండలాల్లో అవగాహన కార్యక్రమాలు


జగదేవ్‌పూర్‌లో ఎన్నికల నియమావళిపై అభ్యర్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రాంరెడ్డి

రాయపోల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున అభ్యర్థులు చట్టాలను ఉల్లంఘించవద్దని ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ లతీఫ్ సూచించారు. గురువారం రాయపోల్‌లో పంచాయతీ అభ్యర్థులకు అవగాహన కల్పించారు. అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, మైక్ ప్రకటనలు నిర్వహించరాదని, ఓటర్లకు డబ్బు, మద్యం ప్రలోభాలు పెట్టవద్దని స్పష్టం చేశారు. శాంతియుతంగా, నిష్పక్షికంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల అబ్జర్వర్ శ్రీవల్లి, ఎస్ఐ మానస తదితరులు పాల్గొన్నారు.

● మద్దూరు : స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందం గ్రామస్థులకు సూచించారు. గురువారం దూళిమిట్ట మండల కేంద్రంలోని నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఎన్నికల వేళ శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మీసాల వీరరాజ్, ఏఎస్ఐ సదాశివరావు, ఎంపీవో మహేష్ జావిద్ పాల్గొన్నారు.


మద్దూరులో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

● మర్కూక్ : ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు మర్కూక్ ఎస్ఐ దామోదర్ అభ్యర్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో పాటించాల్సిన నిబంధనలు, ప్రచార పరిమితులు, చట్టవిరుద్ధ చర్యలపై వివరించారు.

● దౌల్తాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో సర్పంచ్, వార్డు మెంబర్ల అభ్యర్థులకు ఎన్నికల నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సయ్యద్‌గఫూర్ ఖాద్రి, ఇన్‌చార్జి తహసీల్దార్ జహీర్, ఎస్ఐ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● జగదేవ్‌పూర్ : ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రాంరెడ్డి, తహసీల్దార్ నిర్మల, ఏఎస్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. ఇళ్ల గోడలు, ప్రభుత్వ భవనాలు, విద్యుత్ స్తంభాలపై పోస్టర్లు అతికిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.


రాయపోల్‌లో అభ్యర్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

మంతూరు గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

గ్రామాభివృద్ధికి అవసరమైతే సొంత నిధులు వెచ్చిస్తా
గ్రామంలోని దేవాలయాల నిర్మాణానికి కృషి చేస్తా
మంతూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థి పాల రామాగౌడ్


పాల రామాగౌడ్

రాయపోల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంతూరు గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రాయపోల్ మండలంలోని మంతూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థి పాల రామాగౌడ్ అన్నారు. ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఈసారి సర్పంచ్ స్థానం బీసీ జనరల్‌కు కేటాయించడం తన అదృష్టమన్నారు. గ్రామంలో సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తాగునీరు, పారిశుధ్యం, సీసీ రోడ్ల తదితర వసతులు కల్పనకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చినా, రాకున్నా సొంత నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజలకు 24/7 అందుబాటులో ఉంటూ సేవ చేస్తానన్నారు. మహంకాళమ్మ ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని, పోచమ్మ ఆలయం మార్గం కోసం తన వ్యవసాయ పొలం నుంచి దారిచ్చి రోడ్డు నిర్మించి భక్తుల కు అందిస్తానన్నారు. ప్రచారంలో ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందన్నారు.

బీఆర్ఎస్ బలానికి భయపడే సీఎం బహిరంగ సభ

● మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు ఉన్న బలానికి భయపడే మంత్రి పొన్నం ప్రభాకర్ సీఎం రేవంత్‌రెడ్డితో బహిరంగ సభ పెట్టించారని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఒక ముఖ్యమంత్రి సర్పంచ్ ఎన్నికల్లో ప్రచారం చేయడానికి వచ్చి తమ అభ్యర్థులను గెలిపించమనడం ఇదే మొదటిసారి అని వ్యాఖ్యానించారు. ఆయినా బహిరంగ సభకు ప్రజలు ఎవరూ రాలేదన్నారు. ఎన్నికల కోడ్‌ను ముఖ్యమంత్రితో పాటు మంత్రులందరూ ఉల్లంఘించారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాదయాత్ర సమయంలో హుస్నాబాద్‌కు వచ్చి, తాము అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని గొప్పలు చెప్పారని, కానీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో కనీసం తట్టెడు మట్టి కూడా తీయలేదని పేర్కొన్నారు. పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌కు హెలికాప్టర్ డ్రాప్ ఎమ్మెల్యే అని, ఆయనకు నియోజకవర్గంలో ఎన్ని ఊళ్లు ఉన్నాయో, కాంగ్రెస్ నేతల పేర్లు కూడా తెలియవని ఆరోపించారు. నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, చంద్రయ్య, పట్టణ అధ్యక్షుడు అన్వర్, మాజీ జడ్పీటీసీ మంగ, బీలునాయక్, ఎంపీపీలు లక్ష్మి, మండల అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

సామాజిక బాధ్యత ఉండాలి : సీపీ


మాట్లాడుతున్న సీపీ విజయ్‌కుమార్

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికి సామాజిక బాధ్యత ఉండాలని సిద్దిపేట సీపీ విజయ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షల కోసం శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ఆయన ఇంటరాక్ట్ అయ్యారు. విద్యార్థులకు మార్గదర్శక సూచనలు, ఉద్యోగసాధన కోసం మెళకువలను వివరించారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణదయసాగర్, స్టడీ సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా ఎస్సీ సర్టిఫికెట్లు పొందినవారిపై చర్యలు తీసుకోవాలి

● న్యాయం జరిగే వరకు ఎన్నికలను బహిష్కరిస్తాం
● ఇబ్రహీంపూర్ గ్రామంలో ఎస్సీ కుల సభ్యుల నిరసన


గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ భవనం వద్ద నిరసన తెలుపుతున్న ఎస్సీ కులస్థులు

సిద్దిపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను అక్రమంగా పొంది, ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్ గ్రామ ఎస్సీ కులస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ భవనం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని బీసీ దాసరి కులానికి చెందిన కొందరు వ్యక్తులు తప్పుడు ఆధారాలు చూపి, ఎస్సీ వర్గానికి చెందినవారిగా కుల ధ్రువీకరణ పత్రాలను పొందారని తెలిపారు. వాటితో ఎన్నికల్లో తమ ఎస్సీ వర్గానికి రిజర్వైన వార్డు స్థానాలకు నామినేషన్లు వేసినట్టు ఆరోపించారు. గతంలో వారు బీసీలు చెప్పుకుని, బీసీ వార్డు స్థానాలకు పోటీ చేశారన్నారు. ఈ విషయంపై ఎన్నో సార్లు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్లకు ఫిర్యాదు చేసినా ఎలాంటి పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించకపోతే గ్రామ పంచాయతీ ఎన్నికలను తమ వర్గం బహిష్కరిస్తుందని వెల్లడించారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను గ్రామానికి చేరుకుని ఆరా తీశారు. సమస్య ఏదైనా చట్టపరంగా తేల్చుకోవాలని, ఎన్నికలను బహిష్కరించడం వంటి చట్టవిరుద్ధమైన పనులు సరికావని చెప్పారు. అనంతరం ఆర్డీవో, తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తప్పుడు పత్రాలు జత చేసి నామినేషన్ వేసిన వారిపై చట్టపరంగా ఆర్డీవోకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చండీహోమం



హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ప్రతి నెల పౌర్ణమి రోజున నిర్వహించే చండీ హోమాన్ని ఆలయ అర్చకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమ పూజ, తీర్థ ప్రసాద వితరణ, మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఆలయ ఈవో కిషన్‌రావు, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, పూదరి శ్రీనివాస్ గౌడ్, పిల్లి తిరుపతి, ఆలయ అర్చకులు తాటికొండ పరమేశ్వర శర్మ, తాటికొండ వినయ్ శర్మ, శ్రవణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ నౌకాదళ దినోత్సవం


మాట్లాడుతున్నప్రిన్సిపాల్ డా. సునీత

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ కేడెట్లు జాతీయ నౌకాదళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం కళాశాల ఎన్‌సీసీ లెఫ్టినెంట్ బి. కృష్ణయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సునీత మాట్లాడుతూ దేశ రక్షణలో నావికాదళం పాత్ర, ప్రాముఖ్యత గురించి వివరించారు. నావికాదళ యోధ్ద వీరుల పోరాట పటిమ, త్యాగాలను కొనియాడారు. దేశ సరిహద్దు భద్రత, అంతర్జాతీయ సంబంధాలలో నావికాదళం పాత్ర, ఆర్మీ, ఎయిర్ వింగ్‌తో కలిసి చేసే యుద్ధ విన్యాసాల గురించి విద్యార్థులకు తెలిపారు. గత సంవత్సరం నేవీలో ఉద్యోగాలు సాధించిన కాలేజ్ ఎన్‌సీసీ కేడెట్లు సాగర్, శివకుమార్‌లను ఆమె అభినందించారు. ఉన్నతమైన ఉద్యోగాలను సాధించి, కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి


ఉమాపార్థివ కోటిలింగేశ్వరాలయంలో శ్రీదత్తాత్రేయ స్వామికి విశేష అలంకరణ

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీ దత్తాత్రేయ స్వామి వారి జయంతి పురస్కరించుకుని సిద్దిపేట పట్టణంలోని పలు ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమాపార్థివ కోటి లింగేశ్వరాలయం లో స్వామివారికి విశేష అభిషేకం, పుష్పార్చన నిర్వహించారు. అనంతరం నవగ్రహ రుద్ర చండీయాగం నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ పంచముఖ వీరాంజనేయ స్వామి క్షేత్రంలో శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి పంచామృత అభిషేకం, విశేష అలంకరణ, నవకలశ స్నపన నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వైభవంగా మహంకాళి అమ్మవారి కల్యాణోత్సవం

మిరుదొడ్డి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం బేగంపేట గ్రామంలో గురువారం మహంకాళి అమ్మవారి కల్యాణోత్సవాన్ని ముస్తాబు కాపు సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హామీలు.. ఆఫర్లు

(5వ పేజీ తరువాయి)

రహస్యంగా మద్యం, విందులు ఏర్పాటు చేసి వారిని తమ మత్తులోనే ఉంచుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. తొగుట మండల కేంద్రంలో మూడు రోజులుగా గ్రామంలోని నాలుగు దాటించండి చాలు, గల్లీ గల్లీకి అభ్యర్థుల అనుయాయులు మోటారు సైకిళ్లపై మద్యాన్ని తరలిస్తూ ఓటర్లకు పంచుతున్నారు. కొందరు అభ్యర్థులు నేరుగా కుల సంఘాల నేతలకు, యువకులకు ఫోన్ చేసి, మద్యం సరిపోతోందా ఇంకా పంపిస్తామని వాకబు చేస్తున్నట్టు సమాచారం. మద్యం తరలింపుపై అధికారులు ఉక్కుపాదం మోపి, సరఫరాను అడ్డుకట్ట వేసి, స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి సాహిత్య పోటీల్లో అంకిరెడ్డిపల్లి విద్యార్థుల ప్రతిభ

కొండపాక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సాహిత్య పోటీల్లో అంకిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ రెడ్డి తెలిపారు. బాలల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు హైదరాబాద్‌కు చెందిన తెలంగాణ సాహిత్య అకాడమీ రెండు రాష్ట్రాల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించిందని పేర్కొన్నారు. ఏడో తరగతి చదువుతున్న దనుష్ కవితా పోటీల్లో ద్వితీయ బహుమతి గెలుచుకోగా, అదే విభాగంలో ఏడవ తరగతి చదువుతున్న అక్షయ ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

నంగునూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్టు రాజగోపాల్‌పేట ఎస్ఐ వివేక్ తెలిపారు. గత నెల 29న నంగునూరు మండలం మగ్దూంపూర్ గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, నాగరాజుపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ జక్కిరెడ్డి భూపాల్ రెడ్డి (34) మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేసి గురువారం సిద్దిపేట స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరుపరచగా, న్యాయమూర్తి అతనికి రెండు రోజుల జైలు శిక్షతోపాటు రూ10,500 జరిమానా విధించినట్టు ఎస్ఐ వెల్లడించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

ములుగు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ములుగు గ్రామానికి చెందిన బరిగెల అనసూయ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి గురువారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి రూ.15,000 ఆర్థిక సహాయం అందజేశారు.

బండమైలారం సరిహద్దులో చెక్‌పోస్ట్

ములుగు, డిసెంబరు 4: గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ములుగు మండల సరిహద్దున బండమైలారంలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఎస్ఎస్‌టీ ఆధ్వర్యంలో ఏపీఎం యాదగిరి పర్యవేక్షణలో పోలీసుల పహారాలో ఆ మార్గాన వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఇటీవల వంటిమామిడి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను అక్కడి నుంచి బండమైలారానికి మార్చారు. చెక్‌పోస్ట్ వద్ద జగదేవ్‌పూర్ ఏఎస్ఐ సుభాష్, ములుగు హెడ్‌కానిస్టేబుల్ లింగారెడ్డి, మహిళా కానిస్టేబుల్ ఉన్నారు.

తెలంగాణ విద్యా పరిరక్షణ జిల్లా కమిటీ ఎన్నిక

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ సిద్దిపేట జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్టు గురువారం గౌరవ అధ్యక్షుడు పెద్ది రాజు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా సుంచు సురేందర్ ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా నర్సింలు, తిరుపతి, సత్యయ్య, లింగారెడ్డి, బస్వేశ్వర్, బిక్షపతి, తిరుపతి, అనిల్, ప్రధాన కార్యదర్శిగా దేవులపల్లి కిష్టయ్య, అసోసియేట్ ప్రధాన కార్యదర్శిగా ఎల్లయ్య, కార్యదర్శులుగా మల్లయ్య, జానకి రాములు, భైరవ స్వామి, పరుశురాములు, రాజిరెడ్డి, కృష్ణమూర్తి, బాల్ నరసయ్య, రమేష్‌లు ఎన్నుకున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై నిర్లక్ష్యం తగదు

గజ్వేల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పట్ల పోలీస్, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో ఎస్సీ ఎస్టీలపై దాడులు, మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తే ఎస్‌హెచ్‌ఓలు సరైన కేసులు నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. పోలీస్ కమిషనర్ జోక్యం చేసుకుంటే తప్ప నిందితులను అరెస్టు చేయడం లేదన్నారు. ఈ సమావేశంలో భారత రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి, బ్యాగరి వేణు, కాసీం, బట్టల రాజు, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

మైనర్ల డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరం

గజ్వేల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మైనర్ల డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరమని, 18 ఏళ్లు నిండినవారు లైసెన్స్ తీసుకున్న తర్వాతే వాహనం నడపాలని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మరిపాక మురళి సూచించారు. గజ్వేల్ పట్టణంతో పాటు వర్గల్ మండలంలోని జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ట్రాఫిక్ చట్టాలు, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డుపై నడిచేటప్పుడు తప్పనిసరిగా ఎడమ వైపే నడవాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేసిన సిగ్నల్స్‌ను గమనిస్తూ ప్రయాణించాలన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలను ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, లెక్చరర్లు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.


అరెపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్

కేంద్ర నిధుల కోసమే సర్పంచ్ ఎన్నికలు : బీజేపీ

రాయపోల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి వచ్చే రూ.3 వేల కోట్ల నిధుల కోసమే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్నదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ పేర్కొన్నారు. అరెపల్లి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కర్రోళ్ల దివ్య కృష్ణను గురువారం సాయంత్రం ఆయన శాలువాతో సన్మానించారు. పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రజలకు ఆయన కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంకిడి స్వామి, వెంకట్ గౌడ్, నీల స్వామి, నర్సింలు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిరిసినగండ్ల టీచర్‌కు గ్లోబల్ బెస్ట్ టీచర్ రోల్ మోడల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రూపారాణి

కొండపాక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం సిరిసినగండ్ల ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు పెండెం రూపారాణి 'గ్లోబల్ బెస్ట్ టీచర్ రోల్ మోడల్-2025' అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో గురువారం మోటివేషనల్ విజనరీ లీడింగ్ అవార్డ్స్ వారు నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో రూపారాణి అవలంబిస్తున్న వినూత్న బోధన పద్ధతులు, విద్యారంగంలో చేస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డుతో సత్కరించారు. రూపారాణి గతంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సహా పలు సంస్థల నుంచి అవార్డులు అందుకున్నారు. ఇటీవల ఎస్‌సీఈఆర్‌టీ తెలంగాణ వారు ప్రచురించిన 'గణిత ప్రయోగ దీపిక'కు ఆమె రచయితగా కూడా వ్యవహరించారు.

జాతీయ ఛాంపియన్‌షిప్‌నకు ఎంపికైన క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న అధ్యాపకులు

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌నకు ఎంపికైన సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులను అధ్యాపకులు అభినందించారు. నవంబరు 20, 21 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీ వెల్డోమ్ సైక్లింగ్ ట్రాక్‌లో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ సైక్లింగ్ ట్రాక్ సెలక్షన్ ట్రయల్స్‌లో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు నవ్యశ్రీ, లిఖిత పాల్గొని జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈ నెల 19 నుంచి 23 వరకు ఉత్తరాఖండ్‌లోని రుద్రాపూర్‌లో సీఎఫ్ఐ (సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో జరిగే జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలకంఠ మహేశ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బాలసరస్వతి విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్లు పి. సుజాత, రాధికను అభినందించారు. సీనియర్ ఉపాధ్యాయుల ప్రభు, అంజిరెడ్డి, వహీద, బాలలక్ష్మి పాల్గొన్నారు.

'మీ ఓటు.. మీ భవిష్యత్'


కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

గజ్వేల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మీ ఓటే మీ భవిష్యత్తును నిర్ణయిస్తుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రగతి విద్యాసంస్థల కరస్పాండెంట్ మంద అంబదాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కరపత్రాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ మట్టయ్యచౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవం కానున్న సర్పంచ్ అభ్యర్థికి సన్మానం

మిరుదొడ్డి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం బొప్పాపూర్ గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవం కానున్న పోతురెడ్డి లావణ్యనర్సింహారెడ్డిని గురువారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సన్మానించారు. అక్బర్‌పేటలోని ఆయన నివాసంలో లావణ్యనర్సింహారెడ్డికి, అలాగే ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు సభ్యులకు ఆయన శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

థామ్సన్‌కు డాక్టరేట్..

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట గాయత్రి విద్యాలయం ప్రిన్సిపాల్ థామ్సన్‌కు మణిపూర్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ వచ్చిన సందర్భంగా సామాజిక కార్యకర్త గౌస్ బాబా గురువారం ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, థామ్సన్ విద్యావేత్తగా దక్షిణ భారతదేశంలో పేరుగాంచిన విద్యాసంస్థల్లో ఉత్తమ సేవలు అందించి, వందలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దారని ప్రశంసించారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.